

## అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్

**కడప అర్బన్ :** నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ శనివారం పరిశీలించారు. రాయచోటి అండర్ బ్రిడ్జి పార్కు, ఇవలిఆర్ఎస్, అర్బన్ హెల్త్ సెంటర్, జిటిఎస్ పనులను ఆయన పర్యవేక్షించారు. రాయచోటి అండర్ బ్రిడ్జి పార్క్ నిర్మాణ పనుల్లో భాగంగా టాయిలెట్స్, శాంపిట్ వైర్ ఏర్పాటు చేయాలని, లైట్ పోల్స్, వాటర్ ఫౌంటెన్ పనులను చేపట్టాలన్నారు. చిన్నారులకు ఇసుక సేఫ్టీ ప్రక్రియలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అక్కడి ట్యాంక్ నుంచి ప్రజలకు ఉదయం నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. రామరాజుపల్లె అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని చెప్పారు. వినాయక నగర్‌లో గార్బేజ్ ట్రాన్స్‌పోర్టు నిర్మాణ పనులలో రాంప్ వర్క్ మొదలు పెట్టాలని పేర్కొన్నారు. మాసాపేట రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు.

# 9 నుంచి ఏప్రిల్ 3 వరకు ఉద్యమాలు

- హక్కులు, హామీల అమలుకోసమే
- ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వాలి
- ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల హక్కులు, హామీల అమలు కోసం ఈ నెల 9వ తేదీ నుంచి ఏప్రిల్ 3 వరకు ఉద్యమ బాట పడుతున్నట్లు ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం ఉద్యమ ముందడుగులో భాగంగా వైయస్సార్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ నెల 9,10వ తేదీలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తామని పేర్కొన్నారు. 13, 14 వ తేదీలలో కలెక్టరేట్ల ఎదుట భోజన విరామ సమయంలో ఆందోళన నిర్వహిస్తామని చెప్పారు. 15, 17, 20 తేదీలలో ధర్నాలు ఉంటాయని పేర్కొన్నారు. 21వ తేదీ సెల్ డౌన్ పేరుతో ప్రభుత్వ యాప్‌లను పనిచేయకుండా నిలిపివేస్తామని చెప్పారు. 27న ప్రధాన కార్యాలయాల ఎదుట ధర్నా ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 1 ఓదార్పు యాత్ర పేరుతో ఉద్యోగుల, ఉద్యోగం చేస్తూ మరణించిన కుటుంబాలు, సిపిఎస్ ఉద్యోగుల సమస్యలు, కష్టాలు ఇళ్ల వద్దకు వెళ్లి తెలుసుకుంటామని పేర్కొన్నారు. 3న కలెక్టరేట్లలో నిర్వహించే స్పందనలో వినతి పత్రం అందజేస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం, అధికారులు దిగి రాకపోతే అదే నెల 5న 94 సంఘాల ప్రతినిధులతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. మలి దశ ఉద్యమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే తాము కోరుతున్నామని పేర్కొన్నారు. ఎక్కడ గొంతెమ్మ కోరికలు కోరడం లేదని స్పష్టం చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనాలు లేవని, చివరికి ఆరోగ్య సమస్యలు తీర్చుకునేందుకు ఆసుపత్రులలో కూడా హెల్త్ కార్డులు పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉద్యమం ప్రభుత్వంపై కాదని తమ హక్కుల, హామీల అమలు కోసమే అని స్పష్టం చేశారు. హెల్త్ కార్డులకు సంబంధించి ఏడాదికి రూ. 250 కోట్లు ఉద్యోగులు ప్రభుత్వానికి వైద్య ఖర్చుల నిమిత్తం చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. కార్పొరేట్ ఆసుపత్రిలో వారికి లాభం ఉండే చిన్న చిన్న వైద్య సేవలు అందిస్తూ చేతులు దులుపుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో ప్రజల కోసం విధులు నిర్వహించి ఎంతో మంది ఉద్యోగులు ప్రాణాలను విడిచారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రతినెలా 1వ తేదీనే జీతాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇచ్చేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్ రావు, రాష్ట్ర నాయకులు సాంబశివరావు, మల్లేశ్వర రావు, వైసిపి జిల్లా చైర్మన్ జీవన్ చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ కృష్ణ కుమార్, ఉపాధ్యక్షులు పురుషోత్తం, కోశాధికారి రోనాల్డ్ శామ్యూల్ రాజ్, సెక్రటరీ అలీఖాన్, ఏపీపీటీడీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ నరసయ్య, జోనల్ సెక్రటరీ రాజశేఖర్, ఆర్టీసీ రీజినల్ సెక్రటరీ రామమూర్తి, అన్ని సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.

# పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

**ప్రజాశక్తి - బద్వేలు**

స్థానిక సుమిత్రానగర్, మెహబూబ్‌నగర్ వీధుల్లో శనివారం పిడిఎఫ్ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి , పోతుల నాగరాజును గెలిపించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగం రోజురోజుకూ పెరిగిపోతుందని, పాలకులు చూసి చూడనట్టు వ్యవహరిస్తూ, నిరుద్యోగ యువతను తీరని ద్రోహం చేస్తున్నారని చెప్పారు. రాజకీయ విలువలతో పిడిఎఫ్ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి శాసనమండలికి పంపించాలని కోరారు. రాష్ట్రంలో పిడిఎఫ్ అభ్యర్థుల నిజాయితీకి ప్రత్యేక స్థానం ఉందని వారు తెలిపారు. సమస్యలు పరిష్కారం చేసే వారికే పట్టభద్రులు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు గిలకరాజు, ఆటో యూనియన్ కార్యదర్శి రమణయ్య, డివైఎఫ్ఐ కార్యదర్శి పుల్లయ్య, ఆవాజ్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు అన్వర్‌బాష ,మస్తాన్, చేతి వృత్తిదారుల సంఘం నాయకులు మునయ్య, గంగయ్య పాల్గొన్నారు. పట్టణంలో అశోక్ నగర్, దూదేకుల వీధి పలు సచివాలయంలో డివైఎఫ్ఐ, సిఐటియు, వృత్తిదారుల సంఘం, మహిళా సంఘం, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పొంగూరు నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు ఎస్ ప్రవీణ్ కుమార్, రమణారెడ్డి మల్లికార్జున, వెంకటరామయ్య సిఐటియు నాయకులు కొండయ్య, నరసింహ, రాజగోపాల్, గంప సుబ్బరాయుడు, ఐద్వా నాయకులు రత్నమ్మ, అనంతమ్మ, బాలమ్మ, మోక్షమ్మ, మస్తాన్‌బి పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** శాసన మండలిలో ప్రజా సమస్యలపై మాట్లాడాలంటే, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఉండాలని ప్రజా పక్షం నిలబడే అభ్యర్థులనే శాసన మండలికి పంపాలని, పశ్చిమ రాయలసీమ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజ్ పేర్కొన్నారు. ప్రొద్దుటూరులో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు మున్నా వర్ధను సునీల్, అనిల్ పాల్గొన్నారు.



జమ్మలమడుగు: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

**జమ్మలమడుగు రూరల్ :** ప్రజా సమస్యల పరిరక్షణే ధ్యేయంగా నిరంతరం పోరాడుతున్న ఉద్యమ అభ్యర్థులనే చట్ట సభలకు పంపుదామని సిఐటియు ఏరియా ఉపాధ్యక్షులు వీరనాల శివ నారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్ తెలి పారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ బల పరు స్తున్న పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసి ంహ రెడ్డిలను గెలిపించాలని కోరుతూ పట్టణంలో ప్రజా సంఘాల అధ్వర్యంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులను, బ్యాంకు, సచివాలయం ఉద్యోగులను, బ్యాంకు ఉద్యో గులను కలిసి ఓటు ను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు ముని, ప్రసాద్, మధు, ఆచారి పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** ఈనెల 13న నిర్వహించబోయే పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజును, కత్తినరసింహారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జమ్మలమడుగు నియోజకవర్గ కార్యదర్శి ఎం.వి సుబ్బారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి భవాని శంకర్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు చాంద్ బాషా, ఎఐఎస్ఎఫ్ నాయకులు శరత్, లీలా కృష్ణ, భౌరి నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

## ఉద్యోగులపై ఒత్తిడి తగదు : సిపిఎం

**ప్రజాశక్తి - కడప అర్బన్**



మాట్లాడుతున్న రామమోహన్

చెత్తపన్ను చెల్లించకపోతే ఇంటి పన్నుతో కలిపి వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులపై ఒత్తిడి చేయడం తగదని సిపిఎం కడప నగర కార్యదర్శి ఎ. రామమోహన్ తీవ్రంగా విమర్శించారు. శనివారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది చెత్త పన్ను వసూలు చేయకపోతే వేతనాల్లో కోత విధిస్తామని ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమన్నారు. సచివాలయ సిబ్బంది వేతనాలకు చెత్త పన్ను వసూళ్లకు ముడిపెట్టడం అన్యాయమన్నారు. నగర ప్రజానీకాన్ని బెదిరించి, భయపెట్టి చెత్త పన్ను వసూలు చేయాలనుకోవడం నియంతృత్వానికి నిదర్శనమన్నారు. విజయవాడ నగరంలో చెత్త పన్ను వసూలు టార్గెట్ పూర్తి చేయలేదనే కారణంతో సిబ్బంది జీతాల్లో కోత పెట్టారని పేర్కొన్నారు. నగర పాలక సంస్థ వసూలు చేస్తున్న చెత్త పన్నుపై కౌన్సిల్ సమావేశంలో ప్రతి ఇంటి నుంచి రూ.40, రూ.60 వసూలు చేయాలని తీర్మానం చేసిందన్నారు. ఈ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం పొందడం కోసం ప్రభు త్వానికి నివేదిక పంపినా, ఇప్పటివరకు దీనిమీద నిర్ణయం తీసుకోలేదని తెలి పారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, చెత్త పన్ను వసూలుకు, సచివాలయం సిబ్బంది వేతనాలకు కోతబెట్టే ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజానీకాన్ని కలుపుకుని పెద్ద ఎత్తున పోరా టాలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. సిపిఎం కడప నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి, నగర కమిటీ సభ్యుడు పారుక్ హుస్సేన్ పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

**ప్రజాశక్తి-కలసపాడు**

రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి ఎద్దడి రా కుండా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ మహబూబ్‌బీ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో డిడిఒలు, పంచాయతీ కార్యదర్శులతో స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మౌలిక సవతులు, జగనన్న లే అవుట్ల గృహ నిర్మాణం, తాగునీటి వసతి, సంక్షేమ పథకాలు వంటి వాటిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం చేపడుతున్న జగనన్న పక్కాగృహాలు ఏయే స్థాయిలో ఉన్నాయో పరిశీలించి ఎప్పటికప్పుడు నివేదికలను సబంధితాధికారులకు పంపాలని తెలిపారు. కార్యక్రమంలో యుఆర్‌డి మురారి, డివిఒలు శ్రీధర్, వసంతకుమారి, సృజన, సదా శివారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, రేణుక, హబీబా, పాండు రంగాచారి, రవీంద్రారెడ్డి, పౌల్‌రాజ్, మహేష్ పాల్గొన్నారు.

## ఎండియు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాశక్తి - కడప**

వైఎస్ఆర్‌టియుసి అనుబంధ సంఘం జిల్లా అధ్యక్షులు మల్లూరి జాషువ ఆధ్వర్యంలో నగరంలోని ఎండియు ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పౌరసరఫరాల డిపిఒకు వినతి పత్ర అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రతి ఇంటికీ నిత్యావసర సరుకులు అందించాలనే దృఢ సంకల్పంతో ఎండియు వాహనాలు ప్రారం భించారని చెప్పారు. కొందరి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆటో డ్రైవర్లకు సబ్సిడీ పడడం లేదని వాపోయారు. వెంటనే వారికి రావాల్సిన సబ్సిడీ మొత్తాన్ని ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన డిపిఒ పెండింగ్ బకాయిలు చెల్లించి భవిష్యత్‌లో ఎలాంటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌టియుసి ఎండియు ఆటో యూనియన్ నాయకులు శ్రీరాములు, నరసింహ, డ్రైవర్లు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీచౌడేశ్వరిదేవి ఉత్సవాలు

**ప్రజాశక్తి- కడప**



పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న గోవిందు నాగరాజు

నగరంలోని విజయదుర్గ కాలనీలో శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాల 2వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని శనివారం శ్రీశ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా శ్రీ పుష్పాంద మహర్షి ఆశ్రమం పీఠాధిపతి స్వామి దివ్యజ్ఞానానంద గురువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలను విజయ దుర్గా దేవి కాలనీ పార్కు నుంచి విజయ దుర్గ దేవి వరకు బిందుసేవ చేశారు. కార్యక్రమంలో శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవ కమిటీ నిర్వాహకులు గోవిందు నాగరాజు, సిఆర్ఐ సుబ్బరాయుడు, సంగనాథం ఆంజనేయులు, పల్లా రాధాకృష్ణ, వేణు, సిఆర్ఐ సునీల్ జయంత్, పాలకొం డ్రాయుడు, చెంగా సంటెయ్య, కె. సుబ్బరాజు, కమిటీ సభ్యులు, భక్తులు, కాలనీ వాసులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కెవికె సేవలు రైతులకు మరింత చేరువ

**ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె**




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రమణ

కృషి విజ్ఞాన కేంద్రం సేవలు రైతులకు మరింత చేరువ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం తిరుపతి సంచాలకులు డాక్టర్ రమణ పేర్కొన్నారు. శనివారం ఊటుకూరు కెవికెలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రైతులు శాస్త్రీయంగా, సాంకేతికంగా, ఆర్థికంగా పురోగతి సాధించేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలని సూచించారు. ఐసిఎఆర్ ప్రధాన శాస్త్ర వేత ఎ.ఆర్. రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది చిరుధాన్యాల సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటి ంచిందని చెప్పారు. క్షేత్రస్థాయిలో వెళ్లి రైతులకు తగిన సూచనలు, సల హాలు అందజేయాలని పేర్కొన్నారు. గుంటూరు లామ్ ఫామ్ ప్రధాన శాస్త్రవేత్త విశాలాక్షి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాల్లో ఏదైనా లోపాలుంటే శాస్త్రవేత్తలకు తెలియజేసి వాటిని సరిదిద్దుకోవాలని తెలిపారు, తద్వారా రైతు లుగా ఆదాయం పెరుగుతుందని చెప్పారు. రైతు, మార్కెట్, అను సంధానంపై దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం కెవికె శాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య రైతు పొలాల్లో చేపట్టిన ప్రదర్శనలు, ప్రథమ శ్రేణి ఫలితాలను, 2023 -24 సంవత్సరం చేపట్టే కార్యాచరణను వివరించారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ డాక్టర్ శిల్పకళ, లావణ్య, ప్రశాంతి, మహేష్ బాబు,సాయి మహేశ్వరి, స్వామి చైతన్య, మానస, రామలక్ష్మి పాల్గొన్నారు.

## గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా హేమావతి

**ప్రజాశక్తి -కడప సిటీ**



హేమావతిని సన్మానిస్తున్న నర్సింగ్ సిబ్బంది

కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) గ్రేడ్-2 నర్సింగ్ సూప రింటెం డెంట్‌గా ఎం. హేమా వతి బాధ్యతలు చేప ట్టారు. శనివారం ఆస్పత్రి నర్సింగ్ సిబ్బంది ఆమెను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ తాను 1984లో లక్కిరెడ్డిపల్లి డిస్పెన్సరీ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టానని చెప్పారు. 1985-2000 వరకు రాయచోటి సిహెచ్‌సిలో విధులు నిర్వహించానని చెప్పారు. 2006లో బదిలీపై రాజంపేట సిహెచ్‌సి వెళ్లానని తెలిపారు. అదే సంవత్సరం బదిలీపై గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్(రిమ్స్) లోస్టాఫ్ నర్సుగా పనిచేశానని, 2010లో హెడ్ నర్సుగా రిమ్స్‌లోనే బాధ్యతలు చేపట్టి విధులు నిర్వహి ంచానన్నారు. 2019లో బదిలీపై తిరుపతి రుయా హాస్పిటల్‌లో పనిచేశానని తెలిపారు. 2022 జనవరి 18న ఉద్యోగోన్నతిపై గ్రేడ్-2గా సూపరింటెండెంట్‌గా కర్నూలు కంటి ఆస్పత్రిలో పనిచేస్తూ బదిలీపై కడప రిమ్స్‌కు వచ్చానని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారుల సూచన మేరకు రిమ్స్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చెస్తానని పేర్కొన్నారు. అనంతరం నర్సింగ్ గ్రేడ్ -1 సూపరింటెండెంట్ ( మాధురి లత, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీకాంత, హెడ్ నర్సులు, నర్సింగ్ సిబ్బంది పుష్ప గుచ్ఛం ఇచ్చి ఆమెకు అభినందనలు తెలియజేశారు.

## 296 పరుగులకు టీమ్-ఎ ఆలౌట్

**ప్రజాశక్తి - కడప**



అర్థ సెంచరీలు సాధించిన ఫైజాన్, సూర్యతేజ

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెఎస్ఆర్ఎం మైదానంలో అండర్ -16, 19 ఏజ్ గ్రూపు విభాగాలలో శనివారం నిర్వహించిన లీగ్ మ్యాచ్ లో టీం-ఏ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 65.5 ఓవర్లలో 296 పరు గులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని హరి అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి సెంచరీ(101 పరుగులు) చేశాడు. గురు 92 పరుగులు చేశాడు. టీం-బి జట్టులోని జట్టులోని ప్రశాంత్ మూడు వికెట్లు తీసు కున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీం -బి జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లలో నష్టానికి 87 పరుగులు చేసింది. అండర్ -12, 14 ఏజ్ గ్రూపు విభాగంలో కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన టీం- ఏ జట్టు 60 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. ఆ జట్టులోని సూర్య తేజ 53 (నాట్ అవుట్), ఫైజా 52 ( నాటౌట్) పరుగులు చేశారు. టీం- బి జట్టులోని లక్షిత్ 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగుకు దిగిన టీం -బి జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 48.5 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. ఆ చెట్టులోని ప్రశాంత్ 52, సాయి కృష్ణ చైతన్య 47 పరుగులు చేశారు. టీం-ఏ జట్టులోని కుషల్ చంద్ రెండు వికెట్లు తీసుకున్నాడు.

## మహిళా చట్టాలపై అవగాహన




మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

**కడప :** మహిళ చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత సూచి ంచారు. శనివారం నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కుటుంబ, మెయింటినెన్స్ చట్టాలు, గృహహింస, పౌర, క్రిమినల్ చట్టాలు, వరకట్న మరణం, యాసిడ్ దాడి, కిడ్నాప్, అపహరణ, అత్యాచారం, లైంగిక వేధింపులు, పోక్సో చట్టం, పిఎన్‌డిటి చట్టం, టెలిలా యాప్ గురించి వివరించారు. ప్రామిసరీ నోటు, వివాహ వయసు, దిశా చట్టం, 304 బి, ఉచిత న్యాయ సహాయము, జాతీయ, ప్రత్యేక లోక్ అదాలత్‌లు, టోల్ ఫ్రీ నెంబర్లు అయిన 1098, 181, 14567 గురించి తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాది చంద్రకాంతమ్మ, టెలిలా న్యాయవాది అరుణకుమారి, నాగార్జున డిగ్రీ మహిళా కళాశాల డైరెక్టర్ బి. శివవిష్ణు మోహన్‌రెడ్డి, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్స్ శ్రీ సుబ్బ నరసయ్య, శ్రావణి, అనంతలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో మహిళలు రాణింపు

**ప్రజాశక్తి - కడప అర్బన్**



మాట్లాడుతున్న అడ్మినిస్ట్రేటర్ అశ్విని

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని దిశ వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని పేర్కొన్నారు. శనివారం కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళా శాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్, ప్రొటెక్షన్ విభాగం ఆధ్వ ర్యంలో 'మహిళల భద్రత -రక్షణ' పై అవగాహన కార్యక్రమం నిర్వ హిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో మహి ళలు వివిధ రంగాలలో ఈవ్ టీజింగ్, సైబర్, లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆపదలో ఉన్నప్పుడు మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సంరక్షణకు, భద్రతకు ఎవరిని సంప్రదించాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్. మూర్తి, ఎస్ఐ జ్యోతి, మురళీమోహన్, లక్ష్మీ దేవి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాధా, షర్మిలభాను, విద్యార్థులు పాల్గొన్నారు.


## 'సీమ' నాలెడ్జి హబ్‌గా నిలపాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

రాయలసీమ నాలెడ్జి హబ్‌గా గుర్తించేలా రాష్ట్రస్థాయి విజయాన్ని ఇక్కడ విద్యార్థులు సొంతం చేసుకోవాలని యోగి వేమన విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మార్గదర్శకత్వంలో యోగి వేమన విశ్వవిద్యాలయంలో రాయలసీమ, నెల్లూరు జిల్లాల ఉన్నత విద్య చదివే విద్యార్థుల కోసం 'ప్రాంతీయ స్థాయి క్విజ్ ఛాంపియన్ షిప్ - 20 23 ' పోటీల ముగింపు సభ శనివారం నిర్వహించారు. క్విజ్ కో-ఆర్డినేటర్, ఆంగ్ల శాఖ సహ ఆచార్యులు డాక్టర్ ఆర్.వి. జయంత్ కశ్యప్, నోడల్ ఆఫీసర్ ఎం. రమేష్ కుమార్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన యువతను తయారు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి క్విజ్ పోటీలను నిర్వహిస్తోందన్నారు. ప్రొద్దుటూరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు మాట్లాడుతూ పరిపూర్ణ విద్యార్థిగా తయారు అయ్యేందుకు క్విజ్ వంటి వేదికలు ఉపయోగపడతాయన్నారు. క్విజ్ సమన్వయకర్త డాక్టర్ జయంతి కశ్యప్ మాట్లాడుతూ ఐదు జిల్లాల కళాశాలలో నుంచి 22 టీములు పాల్గొనగా నాలుగు టీమ్‌లు సెమీఫైనల్స్‌కు వెళ్లాయన్నారు.

## ఒంటిపూట కళాశాలలు నిర్వహించాలి

**ప్రజాశక్తి - కడప**



వినతి పత్రం అందజేస్తున్న జిసిటిఎ నాయకులు

వేసవిని దృష్టిలో ఉంచుకుని ఒం టిపూట కళాశాలలను నిర్వ హించాలని ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు డాక్టర్ శశికాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య శనివారం వైవీయూ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా డిగ్రీ పరీక్షల మూల్యాంకన వేతనాలు పెంచాలని కోరారు. మూల్యాంకనానికి కడప జిల్లాలోని స్వయంప్రతిపతి కళాశాలల అధ్యాపకులను అనుమతించాలని పేర్కొన్నారు. వీటిపై రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందించారు. కార్యక్ర మంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి డాక్టర్ పి.రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 19 మంది అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు అరెస్టు

**- 28 కిలోల గంజాయి, పోర్డ్ కారు, 4 బైక్‌లు స్వాధీనం**
**- మీడియా సమావేశంలో ఎస్‌పి అన్బురాజన్ వెల్లడి**

**ప్రజాశక్తి - కడప అర్బన్**



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, అమ్మకం చేస్తున్న గంజాయి స్మగ్లర్ల పై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి 19 మంది అంతరాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేశారని ఎస్‌పి అన్బురాజన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ 40 స్పెషల్ టీములు 15 ప్రాంతాలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి స్మగ్లర్లను పట్టుకున్నారని చెప్పారు. అరెస్టయిన వారిలో కిరణ్ కుమార్, సందీప్, పూజారి, శివకుమార్, వెంకట లక్ష్మమ్మ, రాజు, చంద్ర శ్రీకాంత్, అల్లా ప్రకాష్, శంకర్, సుష్మంత్, పుల్లయ్య, వినోద్ కుమార్, పెద్దక్క, ఖాదరవల్లి, రాంబాబు, తిరుపతయ్య, రమేష్, మస్తానమ్మ, కొండయ్య ఉన్నారని తెలిపారు. వీరి వద్ద నుంచి 28 కేజీల గం జాయి, కారు, మూడు ద్విచక్ర వాహనాలు, 16 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు అరెస్టయిన ఐదుగురిపై పీడీ యాక్టు ప్రయో గించామని చెప్పారు. నిందితుల నుంచి మరింత సమాచారం రాబట్టి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న వారిని పట్టుకుంటామని తెలిపారు. కమ లాపురం పిఎస్ పరిధిలో ఐదుగురు, కడప వన్‌టౌన్‌లో ఐదుగురు, పోరుమామిళ్లలో 8 మంది, సిట్టవటంలో ఒకరిని అరెస్టు చేశామని తెలిపారు. గంజాయి వినియోగిస్తున్న 30 మందికి రిహాబిలిటేషన్ సెంటర్ లో కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజలు గంజాయి విక్రయాలు, వినియోగించే వారి సమాచారం డయల్ 100 లేదా ఎస్‌పి సెల్ నంబర్ 9440796900 కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఫ్యాక్షన్ జోన్ డిఎస్‌పి చెంచుబాబు, కడప డిఎస్‌పి బి. వెంకట శివారెడ్డి, టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాజా ప్రభాకర్, కడప వన్‌టౌన్ సిఐ నాగరాజు, కమలాపురం సిఐ సత్యబాబు, మైదుకూరు సిఐ చలపతి, ఎస్ఐబి ఎన్‌స్పెక్టర్ ఉరుకుందమ్మ, ఎస్ఐలు, ఆర్ఎస్ఐ పాల్గొన్నారు. సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

## 8న వైవీయూలో క్రీడా పోటీలు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

వైవీయూలో ఈనెల 8న క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ కె.రామసుబ్బారెడ్డి ఒక ప్రకటన తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ సైన్స్ ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల క్రీడాకారులకు పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, రైఫిల్, పిస్టల్ షూటింగ్ పోటీలుంటాయని పేర్కొన్నారు. ఆయా కళాశాలల ప్రిన్సిపల్ అనుమతితో పోటీల్లో పాల్గొనాలని తెలిపారు.

## రసవత్తరం!

ప్రజాదృష్టి

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల రాజకీయం రసవత్తరంగా మారింది. ఇటీవల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవిని అధికార వైసిపి తన్నుకు పోయిన సంగతి తెలిసిందే. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోటీపై అందరిదృష్టి నిలిచింది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల బరిలో 39 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 12 మంది మధ్య పోటీ నెలకొంది. వీరిలో అధికార, ప్రతిపక్ష పార్టీల మద్దతు కలిగిన అభ్యర్థులను గత ఎన్నికల తరహాలోనే పిడిఎఫ్ అభ్యర్థులు సవాల్ చేస్తున్న సంగతి తెలిసిందే. పిడిఎఫ్ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వారి వ్యూహాలకు అనుగుణంగా అధికార, ప్రతి పక్ష పార్టీల అభ్యర్థులకు ధీటుగా ఎన్నికల ప్రచారం సాగిస్తుండడంతో వ్యవహారం పోటాపోటీగా మారింది. పిడిఎఫ్ తరుపున బరిలో నిలిచిన పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు దన్నుగా ప్రజాసంఘాలు నిలవడంతో ప్రచారం ఉధృతంగా సాగుతోంది. వైసిపి, టిడిపి తరుపున బరిలో నిలిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామగోపాల్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి పట్టుపోగుల పవన్ కరపత్రాల పంపిణీ మొదలుకుని, పోస్టల ద్వారా కరపత్రాల పంపిణీ వరకు ఎవరి వ్యూహాలకు అనుగుణంగా ప్రచారయుద్ధం పతాక స్థాయికి చేరుకుంటోంది. ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని 3,51,700 మంది ఓటర్లలో అత్యధికులను కలిసే విధంగా ఎన్నికల ప్రచారం సాగుతోంది. అధికార, ప్రతి పక్షాల మద్దతుతో బరిలోకి దిగిన అభ్యర్థులు పార్టీ కేడర్ సహకారంతో ముందుకు సాగుతుండడం గమనార్హం. అధికార వైసిపి వాలంటీర్లు దగ్గర నుంచి పార్టీ కేడర్‌తో సమావేశాలును నిర్వహిస్తూ ఓటింగ్ పోలరైజేషన్‌పై దృష్టి సారించింది. టిడిపి సైతం ఎమ్మెల్సీ ఎన్నికలకు పరిశీలకులను నియమించి ఎన్నికల ప్రచారాన్ని హీటెక్కించింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో నిలిచిన 12 మంది అభ్యర్థుల్లో పిడిఎఫ్ తరుపున బరిలో నిలిచిన కత్తి నరసింహారెడ్డి ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. వైసిపి తరుపున బరిలో నిలిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాల అండతోపాటు వైసిపి కేడర్‌ను కలుపుకుని ఉధృతంగా ప్రచారం సాగిస్తున్నారు. గతంలో అధికార వైసిపి అభ్యర్థి బాక్సుల ప్రలోభాలకు తెరలేపిన సంగతి తెలిసిందే. పోలింగ్ సమయం దగ్గరపడే కొద్దీ మరోసారి ప్రలోభాలకు గురి చేసేందుకు అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. అధికార వైసిపికి ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీఫైనల్‌గా భావిస్తున్నట్లుగా మారినట్లు కనిపిస్తోంది. పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలువాలనే ఉద్దేశంతో రకాల వ్యూహాలను అధికార పార్టీ పన్నుతోంది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లు వివేకాన్ని ప్రదర్శించే అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రభుత్వ పనితీరును గణనీయంగా సవాల్ చేసే అవకాశాలు ఉన్నాయని మాత్రం గట్టిగా చెప్పవచ్చు.

**- ప్రజాశక్తి - కడపప్రతినిధి**


బొమ్మలు వేస్తున్న విద్యార్థులు

## ఆట బొమ్మలు, అల్లికలపై అవగాహన

**ప్రజాశక్తి - చాపాడు**

ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం 'నో స్కూల్ బ్యాగ్ డే' సందర్భంగా విద్యార్థులకు ఆటబొమ్మలు, అల్లికలుపై అవగాహన కల్పించారు. పాఠశాలలో పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో శనివారం పుస్తకాలు లేకుండా కేవలం ఆటలు, అల్లికలు, కథలు, యోగా, ధ్యానం వంటి అంశాలను నిర్వహించారు. నెలలో రెండు శనివారాలు విద్యార్థులకు ఈ విధంగా పుస్తకాలు లేకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. లక్ష్మీపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జవహర్ మునీర్ విద్యార్థులకు అల్లికలు, బొమ్మలు గీయడం, యోగా, ధ్యానంపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కథలు చెప్పించారు.

## జాతీయ స్థాయి పోటీలకు తేజేంద్ర ఎంపిక

**ప్రజాశక్తి - వేంపల్లె**

వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తూ విద్యార్థులకు శిక్షణనిస్తున్న రాచవీటి తేజేంద్ర జాతీయస్థాయి పోటీలకు



ఎంపికైనట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి నిత్యపూజయ్య తెలిపారు. ఆ మేరకు గత ఫిబ్రవరి నెలలో 10వతేదీ నుండి 12 వతేదీ వరకు జరిగిన సీనియర్స్ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా తేజేంద్ర గత 2021-22 అకడమిక్ సంవత్సరంలో జరిగిన దక్షిణ భారత దేశస్థాయి పోటీల్లో ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించగా, ఆంధ్ర జట్టుకు ద్వితీయస్థానం వచ్చిందన్నారు. జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలు అమరావతిలో ఈనెల 4, 5 తేదీల్లో జరుగుతున్నట్లు తెలిపారు. ఇందులో తేజేంద్ర ఆంధ్ర జట్టు తరపున పాల్గొంటున్నారని ఆయన వివరించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్‌పై అవగాహన

**ప్రజాశక్తి - చాపాడు**

ఈ నెల 13న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్‌పై తహశీల్దార్ సుభాని శనివారం అవగాహన కల్పించారు. బ్యాలెట్ పేపర్ మీద అభ్యర్థుల పేర్లు, ఫోటో ఉంటుందని తెలిపారు. మొదట ప్రాధాన్యం ఇచ్చే వారికి 1వ నంబర్ వేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఇచ్చే పెన్ మాత్రమే వాడాలన్నారు. ఓటేసేందుకు వెళ్లేటప్పుడు ఐడి ప్రూఫ్‌లు తీసుకెళ్లాన్నారు. బూత్ బయట ఓటర్ జాబితాలో తమ పేరు, క్రమ సంఖ్య సరి చూసుకోవాలన్నారు. అభ్యర్థులందరికీ 1వ నంబర్ వేయరాదన్నారు.

## రేపు వ్యాసరచన పోటీలు

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల ఆవరణలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని కడప నెహ్రూ యువ కేంద్రం, తమ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పులివెందుల నియోజకవర్గ స్థాయిలోని మహిళా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేస్తామన్నారు.


పశువుల పాకను తనిఖీ చేస్తున్న పోలీసులు

## ఘర్షణలకు పాల్పడితే కేసులు

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

గ్రామంలో చిన్నపాటి ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని కలమల్ల ఎస్ఐ శివప్రసాద్ హెచ్చరించారు. మండల పరిధిలోని మాలెపాడు గ్రామంలో శనివారం ఆయన సిబ్బందితో నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫ్యాక్షన్ గ్రామమైన మాలెపాడులో ఉదయం 6 గంటల నుండి తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రతి ఇల్లు, పొలాలు, కలాలు, దుకాణాలు, గేదెల పాకలతోసహా అణువణువు తమ సిబ్బందితో పరిశీలించామన్నారు. ఫ్యాక్షన్ విడనాడి పిల్లాపాపలతో సంతోషకర జీవితాన్ని గడపాలని గ్రామస్తులకు సూచించారు. స్థానిక సుందరయ్య నగర్‌లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని శనివారం సిఐ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కాలనీలోని ద్విచక్ర వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ద్విచక్ర వాహనాలను దొంగిలించి తక్కువ ధరలకు అమ్ముతున్నారని, అలాంటి పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు కొనకూడదని స్థానికులకు సూచించారు. అలాంటి వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

## నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

పులివెందుల శిల్పారామంలో ఆదివారం సాయంత్రం వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శిల్పారామ పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప చిన్నారులచే జానపద, వెస్ట్రర్స్ వంటి నృత్య ప్రదర్శనలు ఉంటాయాన్నరు. కార్యక్రమాలను స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## అరటితోట దగ్ధం : రూ.2 లక్షలు నష్టం

**ప్రజాశక్తి - లింగాల**


కాలిపోయిన అరటితోట

మండల పరిధిలోని లోపట్నూతల గ్రామం లో పెద్ద పోతుల సునీత అనే రైతుకు చెందిన అరటి తోట శనివారం ప్రమాదవశాత్తూ అగ్నికి కాలిపోయింది. ఆమెకు ఉన్న ఎకరా పొలంలో అరటి పంట సాగు చేశారు. ఈ ప్రమాదంలో డ్రిప్పు పరికరాలు, పైపులు పూర్తిగా కాలిపోయాయి. మరో 20 రోజులు ఉంటే అరటి పంటను వ్యాపారులకు అమ్మేవారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత మహిళా రైతు విలపించారు. అగ్నిమాపక సిబ్బంది వేరే ప్రాంతానికి వెళ్లడంతో పంటను కాపాడలేకపోయారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారి నారాయణ అరటితోటను పరిశీలించారు.

# 'కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడొద్దు'

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

శనగల కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడొద్దని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శనివారం ప్రభుత్వ బుడ్డ శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తిరుపేల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం బుడ్డశనగలకు రూ.5335 మద్దతు ధర ప్రకటించి, వాటిని కొనుగోలు చేస్తోందన్నారు. ఇందులో ఎలాంటి విమర్శలకు తావులేకుండా, దళారి వ్యవస్థలేకుండా గిట్టుబాటు ధరను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. శనగ సాగు వేసి పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అనంతరం కొనుగోలు కేంద్రానికి శనగలను తీసుకొచ్చి అమ్ముకోవచ్చని ఆయన సూచించారు. కొనుగోలు చేస్తున్న శనగలను పరిశీలించి, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. శనగ పంట ఎంత మేర వేశారు.. దిగుబడి ఏ మేరకు వచ్చిందని ఆరా తీశారు. కొనుగోలు కేంద్రం వద్ద ఏవైనా సమస్యలు వస్తే


రైతులతో మాట్లాడుతున్న ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు తిరుపాల్‌రెడ్డి

తమ దృష్టికి తేవాలన్నారు. కొనుగులు కేంద్రాల్లో కూలి ఖర్చు నిమిత్తం క్వింటాల్‌కు రూ.60 మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. మరే ఇతర ఖర్చులు ఉండవని తిరుపేల్‌రెడ్డి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు పి.సురేష్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి యస్.శివశంకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి


ప్రజలతో మాట్లాడుతున్న సిఐ వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి - వేంపల్లె**

గ్రామీణా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సిఐ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం తెల్లవారుజామున మండలంలోని అలవలపాడు గ్రామంలో సిఐ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అలాగే గ్రామ సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండాలని కోరారు. ఫ్యాక్షన్ వల్ల జీవితాలు నాశనం అవుతాయని, పిల్లల చదువులకు ఆటంకాలు ఇబ్బంది కలుగుతుందని వివరించారు. చిన్న,చిన్న సమస్యలను గ్రామాల్లో ఉన్న ప్రజలే ఐక్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఘర్షణలు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అయా పార్టీల నాయకులు బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు**

మానవ తప్పిదాలతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతాయని ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఆయన జాతీయ భద్రతాదినోత్సవంపై ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మానవాళి మనుగడకు భద్రత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతపై ప్రజలు ప్రత్యేకదృష్టి పెట్టాలని కోరారు. భద్రత అనేది ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. సమాజానికి ఒక నిర్దేశితనివ్వడానికి ఇలాంటి దినోత్సవాలను జరుపుకుంటున్నట్లు చెప్పారు. పని చేసే ప్రదేశంలో భద్రతను కట్టుదిట్టం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగులు, సామాన్య ప్రజలు తమ జీవన విధానంలో, వృత్తుల్లో భద్రత, ఆరోగ్య రక్షణ ఒక అంతర్భాగమన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు మాట్లాడుతూ దేశంలో ప్రతి ఏడాది లక్షల మంది రోడ్డు ప్రమాదంలో మరణిస్తున్నారని తెలిపారు. మరికొందరు తీవ్ర గాయాలపాలవుతున్నారని వివరించారు. ప్రతి ఒక్కరూ తమవంతుగా భద్రతను పాటించాలని కోరారు. భద్రతాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీ పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు అరవింద్, విద్యార్థులు పాల్గొన్నారు.


భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తిరుపాల్ నాయక్

# అవగాహనా పత్రాలతో పరిశ్రమలు వచ్చినట్లు కాదు

**ప్రజాశక్తి - వేంపల్లె**

అవగాహనా పత్రాలతో పరిశ్రమలు వచ్చినట్లు కాదని పిసిసి మీడియా చైర్మన్ ఎన్. తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు వరద రాబోతున్నట్లు, భారీస్థాయిలో పరిశ్రమలు రానున్నట్లు, దీంతో నిరుద్యోగ సమస్య తీరనున్నట్లు కాదని ఆయన విమర్శించారు. వైసిపి ప్రభుత్వం ప్రజలకు, నిరుద్యోగులకు అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తోందని తెలిపారు. కొత్త పరిశ్రమలు దేవుడెరుగు ఉన్న పరిశ్రమలను కాపడితే చాలన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవానికి, పోరాట స్ఫూర్తికి ప్రతీకైన విశాఖ


మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

ఉక్కు కర్మాగారం మూతపడుతూంటే, దాన్ని కాపాడాలేని సిఎం కొత్త పరిశ్రమలు తెస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధించి ఉంటే గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ పెట్టకుండానే పెట్టుబడిదారులు రాష్ట్రానికి క్యూ కట్టేవారన్నారు. ప్రభుత్వ అసమర్థత, అవినీతి వంటి కారణాలతో పారిశ్రామిక రంగం కుంటుపడిందని ఆరోపిం చారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక వ్యతిరేక విధానాల వల్ల రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులు రావడం లేదన్నారు. గత మూడేళ్ల కాలంలో దేశంలోకి రూ.11,79,139 కోట్లు విదేశీ పెట్టు బడులు రాగా, రాష్ట్రంలోకి కేవలం రూ.4057 కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. రాబోవు ఏడాది కాలంలో పెట్టుబడులు పెడతారంటే ఎలా నమ్మాలని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి వాటిని మానుకోవాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

# పిల్లలకు టీకా తప్పక వేయించాలి : డిఎంహెచ్ఒ

**ప్రజాశక్తి - వేంపల్లె**

పిల్లలను రోగాల బారినుంచి కాపాడేందుకు వారికి టీకా తప్పక వేయించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు సూచించారు. స్థానిక 1,7,8 సచివాలయాల పరిధిలో చిన్నారులకు వేస్తున్న టీకా కార్యక్రమాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి 16 ఏళ్ల వయసు వచ్చే వరకు పలు విడతలుగా ప్రభుత్వం ఉచితంగానే టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు కూడా తమ బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ, నిర్దేశించిన సమయం ప్రకారం టీకా వేయించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల పరిదిలో ప్రత్యేక కార్యాచరణ ద్వారా వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. చిన్నారులను గుర్తించి వారికి సకాలంలో టీకా వేసే బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. మంచానికే పరిమితమైన రోగుల ఇంటికి వెళ్లి చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు స్వాతిసాయి, నిజాముద్దీన్, హెల్త్ ఎడ్యూకేటర్ షఫిఉన్నిషా బేగం, సిహెచ్ఒ వెంకటరత్నం, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


టీకా వేసే కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ నాగరాజు

# నిబంధనల మేరకే స్కానింగ్ సెంటర్ల నిర్వహణ


స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డాక్టర్ శాంతికళ

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్కానింగ్ సెంటర్లు నిర్వహించాలని ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శాంతికళ పేర్కొన్నారు. భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె స్థానిక 34 స్కానింగ్ సెంటర్లను 9 బృందాల ద్వారా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికళ మాట్లాడుతూ ప్రతి సెంటర్ తప్పక రిజిస్ట్రేషన్ చేయించు కోవాలన్నారు. లేకపోతే స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తే సీజ్ చేస్తామన్నారు. ప్రతి స్కానింగ్‌ను నమోడు చేసి ఆన్‌లైన్‌లో వారి పూర్తి వివరాలు పొందుపరచాలని సూచించారు. లింగ నిర్ధారణ చేస్తే ఆ సెంటర్‌ను సీజ్ చేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు ఇలియా రాణి, శివప్రసాద్‌రెడ్డి, రాజేష్, నజీర్ బాషా, మంజుల, చరిత, కరిష్మా, శ్రీనివాసులు పాల్గొ న్నారు.

**వేంపల్లె :** ప్రయివేటు ఆసుపత్రిల్లో ఉన్న స్కానింగ్ సెంటర్లను రిజిస్ట్రేషన్ తప్పకుండా చేయించుకోవాలని తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిజాముద్దీన్ కోరారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు వేంపల్లెలోని డాక్టర్ ఎస్ఎఫ్ బాషా హాస్పిటల్‌ను నిజాముద్దీన్, హెల్త్ ఎడ్యూకేటర్ షఫీఉన్నిషా తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా ఉంటే వైబ్‌లో నమోదు చేయాలని తెలిపారు.

# బోటింగ్‌ను పర్యవేక్షించిన అధికారులు

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

వాటర్ స్పోర్ట్స్ సింపుల్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్‌ను దాల్మియా చీఫ్‌తో కలిసి శనివారం ఉదయం మైలవరం జలాశయంలో అధికారులు బోటింగ్ చేస్తూ పర్యవేక్షించారు. మైలవరం, గండికోట బోటింగ్‌ను పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి సమాచారం రావడంతో పర్యవేక్షించినట్లు తెలిసింది. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు, డిఎస్‌పి నాగరాజు, అర్బన్, రూరల్ సిఐలు సదాశివయ్య, కొండారెడ్డి, మైలవరం ఎస్ఐ, జమ్మలమడుగు, మైలవరం రెవెన్యూ అధికారులు, బోటింగ్ మేనేజర్ కె.దుర్గా అశోక్, లోకేషన్ ఇన్‌ఛార్జి పి.అమీర్‌బాషా, ఆపరేటర్లు సాయికుమార్, గురుశంకర్ ఉన్నారు. ఎందుకు బోటింగ్ చేశారు. అధికారులు ఇలా ఎందుకు పర్యవేక్షించాలని స్థానికుల్లో చర్చనీయాంశమైంది.


బోటింగ్ చేస్తున్న పలు శాఖల అధికారులు


అజయ్ తల్లిదండ్రులకు చెక్కు అందిస్తున్న సంస్థ సభ్యులు

## శస్త్రచికిత్సకు రూ.2 లక్షల ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

స్థానిక కృపానగర్‌లో నివాసముంటున్న పాలగిరి రవి కుమారుడు అజయ్‌కుమార్ శస్త్రచికిత్స నిమిత్తం ఆరదణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బైసాని సత్యనారాయణ శనివారం రూ.2లక్షలు ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గతేడాది కరెంటు ప్రమాదంలో గాయపడిన అజయ్‌కుమార్ చేతికి శస్త్రచికిత్స అవసరమన్నారు. తన చిన్ననాటి మిత్రుడు ముత్యాలపాటి విశ్వనాథ్ సహకారంతో అజయ్‌కుమార్ తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. విశ్వనాథకు అజయ్‌కుమార్ కుటుంబ సభ్యుల, ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు అమరావతి శ్రీనివాసులు, కుమార్‌స్వామి, మాధవ పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న ఎఒ, రైతులు

## ఆముదం, బత్తాయి పంటల పరిశీలన

**ప్రజాశక్తి - ముద్దనూరు**

మండలంలోని కొర్రపాడు గ్రామంలో రబీలో సాగు చేసిన ఆముదం, బత్తాయి పంటలను శనివారం వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఆరు మంది రైతులు ఆముదం పంట సాగుచేసినట్లు చెప్పారు. పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి, పేనుబంక, పచ్చదోమ అధికంగా ఉందన్నారు. వీటి నివారణకు ఇమిడా క్లోపిడ్ అనే మందును 0.4 ఎమ్ఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతు తన పొలంలో పండిన అముదం గింజలతో చెక్కను తయారు చేసి బత్తాయి చెట్లకు సత్తువలా ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. బత్తాయి పంటలో అంతరపంటగా అముదం, టమోటా వినూత్నమైన పద్ధతిలో సాగుచేసి అధిక దిగుబడులతో ఆదాయాన్ని పొందుతున్నట్లు తెలిపారు. ఇప్పటికి రూ.40 వేలు పెట్టుబడి పెట్టగా.. రూ.లక్ష 40 వేలు లాభం వచ్చిందనట్లు రైతు తెలిపారు. సాహో అనే టమోటా రకాన్ని సాగు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిఇఒ నాగ స్వర్ణ, రైతులు పాల్గొన్నారు.

## సుస్థిర వ్యవసాయం చేపట్టాలి

**ప్రజాశక్తి - వేంపల్లె**

రైతులు సుస్థిర వ్యవసాయం చేపట్టాలని ఎఒ రాజేంద్రప్రసాద్ సూచించారు. మండలంలోని తాళ్లపల్లె రైతు భరోసా కేంద్రంలో శనివారం సుస్థిర వ్యవసాయం అధ్వర్యంలో 19వ సిఎస్ఎ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎస్ఎ సంస్థ 19ఏళ్లుగా రైతులను ఆదుకోవడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం కూడా విత్తనం కొనుగోలు నుండి పంట కోతల వరకు రైతులకు కావాలసిన అన్ని రకాల సేవలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థనైన సిఎస్ఎ అందిస్తున్న అన్ని పథకాలను రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలను సాగు చేసి పెట్టుబడులను తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిఎస్ఎ ప్రోగ్రాం అధికారి ఓబులేసు, కిసాన్ మిత్ర భాస్కర్, శాస్త్రవేత్త డాక్టర్ రామాంజనేయులు, ఎస్‌పిఒ చైర్మన్లు స్వామిరెడ్డి, మల్లీశ్వరమ్మ, నాగన్న, బిసిఒ నాగవెంగమ్మ, సిఇఒ రాజారెడ్డి, గంగాభవాని, శ్రీకాంత్, శ్రీవాణి, రైతులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యానేరమని పట్టణ ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ సొసైటీ (సిర్డ్స్) ఆధ్వర్యంలో శనివారం 'భేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఆడ, మగ ఇద్దరూ సమానమేనని తెలిపారు. చంద్రుడు లేని ఆకాశం ఎంతబోసిపోయి కనిపిస్తుందో.. ఆడబిడ్డలేని కుటుంబం అలాగే ఉంటుందన్నారు. సొసైటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆడపిల్లను బతకనిద్దాం.. ఎదగనిద్దాం.. చదవనిద్దాం వంటి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## సాంకేతిక విజ్ఞానంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

విద్యార్థులు సాంకేతిక విజ్ఞానంపై ప్రత్యేకదృష్టి పెట్టాలని రూరల్ సిఐ బాల మద్దిలేటి సూచించారు. స్థానిక నారాయణ పాఠశాలలో శనివారం సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రూరల్ సిఐ, ఎబిఎం చెన్నకేసవ రాజు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ మన జీవన శైలిలో సైన్స్ ప్రాముఖ్యత గురించి వివరించారు. విద్యార్థి దశ నుండే ప్రయోగాలు చేస్తూ అబ్దుల్ కలాంలా దేశానికే కీర్తిని తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్ట్ నమూనాలను, సాంస్కృతిక కార్యక్రమాలను వారు అభినందించారు. సైన్స్ క్విజ్ పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సునీతరెడ్డి, కడప జోనల్ కో-ఆర్డినేటర్ ఇందిరా, వైస్ ప్రిన్సిపల్ అంజనాదేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

**ప్రజాశక్తి - చాపాడు**

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజంలో మంచి పేరు, ప్రఖ్యాతలు సంపాదించాలని సిబిఐటి ఇంజనీరింగ్ కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి ఆకాంక్షించారు. కళాశాల ఆవరణలో శనివారం కళాశాల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రస్తుత కాలంలో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా రాణించాలన్నారు. పోటీ ప్రపంచంలో అందరికంటే ముందంజలో ఉంటేనే రాణిం చగలుగుతామన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మాధవి, ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులరెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ రవీంద్ర, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి